సాక్షి
బాపట్ల

గురువారం । 14 । ఆగస్టు । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



కాలువలోకి జారిన కళాశాల బస్సు

కొల్లూరు : ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి బుధవారం పంట కాలువలోకి జారింది. చివరకు పొక్లెయిన్ సాయంతో బస్సును బయటకు తీశారు.

కలెక్టర్ కార్యాలయం సందర్శన



బాపట్ల : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్. విజయభారతి బుధవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. 'హర్ ఘర్ తిరంగా' ఫొటో ఫ్రేమ్ వద్ద దేశభక్తిని చాటారు.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

డీఈఓ పురుషోత్తమ్

బాపట్లటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో పురుషోత్తమ్ తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు మొత్తం సెలవు అమలు చేయాలన్నారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొనాలన్నారు. మండలాల్లోని విద్యార్థులు ఆయా పాఠశాలలకు హాజరై ఆగస్టు 15 దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చప్టాలు, కల్వర్టులపై నుంచి ప్రమాదకర స్థాయిలో వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయరాదన్నారు. పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ఉధృతి కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు భారీగా వరద నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. కాలువలు దాటకుండా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు వరద ముంపునకు గురయ్యే అవకాశమున్న ప్రదేశాలలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తక్షణం పోలీస్ సహాయం అవసరమైతే డయల్ 100/112, స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

గుంటూరు ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి. హోస్మణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్‌ఏసీ) ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డాక్టర్ కె.సుచిత్రను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేసి, అక్కడ రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా డాక్టర్ జి.శోభరాణి గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియలిస్టుగా పనిచేస్తున్నారు. గతంలో డాక్టర్ శోభరాణి గుంటూరు ఆర్డీగా పనిచేశారు.

మూడు రోజుల పాటు మార్కెట్ షాపుల బహిరంగ వేలం

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ షాపుల బహిరంగ వేలం ఈ నెల 18, 19, 20 తేదీలలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో రాష్ట్ర గవర్నర్ పర్యటన, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల వల్ల వాయిదా పడిన షాపుల వేలాన్ని నిబంధనల మేరకు నిర్వహిస్తామన్నారు.

అమరేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించే పవిత్రోత్సవాలను అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలి రోజు బుధవారం ఉదయం 5గంటల నుంచి ఆలయ ఆవరణను శుద్ధిచేసి భక్తులకు 9 గంటలకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. రెండవరోజు గురువారం పవిత్రో త్సవాలలో మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం , చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈఓ రేఖ తెలిపారు.

ముంచెత్తిన వాన

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం..వరికి తీవ్ర నష్టం

- జిల్లాలో 38 వేల ఎకరాల్లో మునిగిన వరి
- బుధవారం ఉదయానికి జిల్లావ్యాప్తంగా 8 సెంటీమీటర్ల వర్షం
- చుండూరులో అత్యధికంగా 27 సెంటీమీటర్ల భారీ వర్షం
- కారంచేడులో 15, కొల్లూరులో 13 సెంటీమీటర్ల వర్షం
- అమృతలూరు, వేమూరు, చీరాల, బాపట్ల, కర్లపాలెంలలోనూ 10 సెంటీమీటర్ల వాన
- వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో నీట మునిగిన వరి
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- పలు కాలనీల్లోకి వర్షపు నీరు
- ముంపు ముంగిట్లో లంక గ్రామాలు
- దిగువకు 3.15 లక్షల క్యూసెక్కులు విడుదల



బాపట్ల మండలం ముత్తాయిపాలెం ప్రాంతంలో వర్షానికి నీట మునిగిన వరి పొలాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో రెండురోజులుగా భారీవర్షం కురుస్తోంది. మంగళవారం ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో బుధవారం ఉదయంనాటికి జిల్లాలో సగటున 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో రేపల్లె, వేమూరు, బాపట్ల, నియోజకవర్గాల్లో వేలాది హెక్టార్లలో వరినాట్లు నీటమునిగాయి. బుధవారం సాయంత్రం నాటికి జిల్లాలో పై మూడు నియోజకవర్గాల పరిధిలో వెద పద్ధతిలో 32 వేలు, నాట్లు పద్ధతిలో 8 వేల హెక్టార్ల చొప్పున మొత్తం 40 వేల హెక్టార్లలో వరిపంట సాగైంది. వర్షాల కారణంగా కర్లపాలెం మండలంలో 2,512 హెక్టార్లు, అమృతలూరులో 4,978, చుండూరు మండలంలో 4,500, బాపట్ల మండలంలో 2,320, రేపల్లెలో 150, చెరుకుపల్లిలో 230 హెక్టార్ల చొప్పున మొత్తం 15,187 హెక్టార్లలో వరిపంట నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా. వాస్తవానికి సుమారు 20 వేల హెక్టార్లలో వరి నీట మునిగినట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే మరింతగా వరి నీటమునిగి కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగువకు 3.15 లక్షల క్యూసెక్కులు

బుధవారం ప్రకాశం బ్యారేజీవద్ద 3.15 లక్షల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి వరద నీరు పెరిగే అవకాశముంది. దీంతో కొల్లూరు మండలంలోని లంక గ్రామాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అధికారులను మరింత అప్రమత్తం చేశారు. వరద సమాచారాన్ని లంక గ్రామాల ప్రజలకు అందించారు. వరద పెరిగితే అన్నిరకాల చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికార యంత్రాగం సన్నద్ధమైంది. వర్షం, వరద పరిస్థితులను కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా

మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంలో అత్యధికంగా 27 సెంటీమీటర్ల వర్షం కురవగా పర్చూరు నియోజకవర్గం కారంచేడులో 15 సెం.మీ, కొల్లూరులో 13, చీరాలలో 12, కర్లపాలెంలో 12, వేమురులో 11,అమృతలూరు, బాపట్లల్లో 10 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఇంకొల్లులో 9 సెంటీమీటర్లు, రేపల్లెలో 6.5, కొరిశపాడులో 8, భట్టిప్రోలు, నిజాంపట్నంలలో, చినగంజాంలలో 6, అద్దంకిలో 5, జె.పంగులూరులో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లోనూ ఒక మోస్తరు వర్షం కురిసింది.

రైతులు అప్రమత్తం కావాలి..

జిల్లాలో వర్షాలు కురుస్తున్నందువల్ల రైతులు అప్రమత్తం కావాలి. వర్షం వల్ల నీటమునిగిన వరి పంటలో నీటిని తొలగించి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల ఎంటీపీ చల్లుకోవాలి. పొలం తడి ఆరగానే ఎక్సాకోనజెల్ 400 ఎంఎల్, బావిస్టిన్ ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి. రేపల్లె నియోజకవర్గంలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉన్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా 20 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీలను సిద్ధంగా ఉంచాం. అవసరమైన రైతులు వాటిని వినియోగించుకోవాలి.

– ఎం.సుబ్రమణ్యేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి





బాపట్ల రామకృష్ణాపురం ప్రాంతంలో ఇళ్లల్లోకి చేరిన నీరు



స్వర్ణ-దగ్గుబాడు రోడ్డులో చెరువును తలపిస్తున్న మాగాణి పొలాలు

వాగులు ఉగ్రరూపం

సాక్షినెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా చీరాల, అద్దంకి, పర్చూరు నియోజవకర్గాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కారంచేడు ప్రధాన రహదారిగా ఉన్న సినిమా హాలు రోడ్డులో మోకాలికిపైగా నీరు నిలిచిపోయింది. కారంచేడులో 149.2 మి.మీ వర్షం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జె.పంగులూరు మండలంలో 40 మి.మీ వర్ష పడినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు.

ఉధృతంగా ఈపురుపాలెం 'స్ట్రయిట్ కట్'

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని ఈపురుపాలెం స్ట్రయిట్ కాలువ వర్షపు నీటి పారుదలతో నిండుకుండగా మారింది. పర్చూరు నియోజకవర్గ నుంచి వర్షపు నీరు స్ట్రయిట్ కాలువ ద్వారా వాడరేవులోని దానవాయిపేటలో సముద్రంలో కలుస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి అధికంగా వర్షపు నీరు రావడంతో కాలువలో నీటిమట్టం పెరిగిపోయింది. మళ్లీ భారీ వర్షాలు కురుస్తే స్ట్రయిట్‌కట్ ఉగ్రరూపం దాల్చితే ఇబ్బందులు తప్పవని సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు.

పంటలు వర్షార్పణం

చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. పర్చూరు నియోజకవర్గం కారంచేడు మండలంలో 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కృష్ణా చివరి ఆయకట్టు కావడంతో ఇక్కడ ఆలస్యంగా వరి నాట్లు వేస్తారు. భారీ వర్షాలకు ఇక్కడి బీడు పొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి.

- ఇంకొల్లు ప్రాంతంలో కురిసిన వర్షం ఇప్పటికే సాగులో వున్న పత్తి, మొక్కజొన్న, మినుము పంటలకు మంచిదని రైతులు పేర్కొంటున్నారు.
- అద్దంకి ప్రాంతంలో కొద్దిపాటి వర్షం కురిసింది. ఈ వర్షంతో పొలాలు పదునెక్కుతాయని రైతులు చెబుతున్నారు.
- చీరాల ప్రాంతంలో భారీ వర్షం కురిసినా పంటలు లేకపోవడంతో నష్టంలేదు. అరకొరగా వేసిన వేరుశనగ పంటకు వర్షం అనుకూలమని రైతులు పేర్కొంటున్నారు.
- వర్షంవల్ల బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల రూరల్ మండలాల్లో సాగుచేసిన వరిపంట నీటమునిగింది. వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాలనుంచి నీరు బయటకు వెళ్లేదారిలేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులు పొలాల్లో నీళ్లువుంటే వరి కుళ్లి పోతుందని, తిరిగి ఎద పద్ధతిలో వరిసాగు చేయడం కష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 87 హెక్టార్లలో వేరుశనగ పంట నీటమునిగింది.



కొల్లూరు మండలంలో నీట మునిగిన వరి పొలాల నుంచి నీటిని బయటకు పంపేందుకు ప్రయాస పడుతున్న రైతులు


కంట్రోల్ రూమ్ నంబర్లు	బాపట్ల కలెక్టరేట్ కంట్రోల్ రూమ్	రేపల్లె ఆర్డీఓ కంట్రోల్ రూమ్:	కొల్లూరు కంట్రోల్ రూమ్:	భట్టిప్రోలు కంట్రోల్ రూమ్:
	టోల్ ఫ్రీ :1077, ఫోన్ : 08643220226	సెల్: 8648293795	సెల్ : 7794894544	83319 13995, 8712655931



వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ



వేమూరు మండలం జంపని గ్రామంలో నీట మునిగిన వరి పొలాలు



కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి వద్ద వరద ప్రవాహం

చైతన్య ఝురి.. క్షీరపురి

- చీరాల నుంచే ఎన్నో ఉద్యమాలకు పునాది
- దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న 'చీరాల - పేరాల' ఉద్యమం
- బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం నడిపిన 'దుగ్గిరాల'

స్వాతంత్ర్య స్ఫూర్తి

చీరాల: బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పన్నులు చెల్లించకుండా చేసిన సహాయ నిరాకరణ ఉద్యమం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. భయపెట్టినా జైలుకు పంపినా మహనీయుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నడిపిన చీరాల–పేరాల ఉద్యమం నేటికీ సంచలనమే. భారత స్వాతంత్ర్య పోరాటంలో చీరాల–పేరాల ఉద్యమం పేరెన్నిక పొందింది. దీనికి సారథ్యం వహించిన దుగ్గిరాల గోపాలకష్ణయ్య అకుంఠిత దీక్షతో వాక్‌చాతుర్యంతో పోరాటం చేసి 'ఆంధ్రరత్న' బిరుదుతో ప్రజల హృదయాల్లో నిలిచారు. కాంగ్రెస్ ఉద్యమంలో చేరి దేశమాత సేవలో భాగంగా దుగ్గిరాల జాతీయోద్యమంలో పాల్గొంటూ 1919లో చీరాల వచ్చారు. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం చీరాలను మున్సిపాలిటీగా చేసి అధిక పన్నుల భారాన్ని మోపింది. దీంతో ప్రజలు మున్సిపాలిటీ రద్దును కోరుతూ అప్పటి ఒంగోలు కలెక్టర్ శొంఠి రామ్మూర్తి పంతులు వద్దకు చర్చకు వెళ్లారు. అయితే సబ్ కలెక్టర్ అభిప్రాయాలు దుగ్గిరాలకు నచ్చలేదు. దీంతో గోపాలకృష్ణయ్య ప్రజల్లో జాతీయ భావాలను పెంచేందుకు మున్సిపల్ రద్దుకు శాంతియుతంగా ప్రజల ఉద్యమాన్ని నడిపేందుకు నిర్ణయించారు. ఇందుకోసం శ్రమదాంధ్ర విద్యాపీఠ గోష్ఠిని ఏర్పాటు చేశారు. దీని ద్వారా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని దుగ్గిరాల భావించిన ప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం వ్యతిరేకించింది.



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

రామదండుతో ఉద్యమం ఉధృతం..

ఈ క్రమంలోనే జాతీయోద్యమాన్ని శాంతియుతంగా నడిపేందుకు దుగ్గిరాల రామదండును ఏర్పాటు చేశారు. రామదండులోని సభ్యులందరూ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. ఈ సమయంలోనే జరిగిన చీరాల మున్సిపల్ ఉద్యమంలో దుగ్గిరాల చురుగ్గా పాల్గొన్నారు. 1921లో మహాత్మాగాంధీ చీరాల వచ్చిన సందర్భంగా తాటాకుపై స్వాగతాన్ని రాసి ఆహ్వానం పలికారు. మున్సిపల్ రద్దుకు గాంధీ సహాయ నిరాకరణ, పుర బహిష్కరణ మార్గాలను సూచించగా దుగ్గిరాల పుర బహిష్కరణానికి పిలుపునిచ్చారు. దుగ్గిరాల నేతృత్వంలో చీరాల–పేరాల ప్రజలు మున్సిపాలిటీని వదిలి దూరంగా పాకలు వేసుకొని జీవనం సాగించారు. చీరాల రామ్‌నగర్‌లో నివాసాన్ని ఏర్పాటు చేసుకున్న దుగ్గిరాల అనేక ప్రాంతాలలో పర్యటించి, కాంగ్రెస్ కార్యాలయాలను స్థాపించి జాతీయోద్యమంలో ప్రజలు ఉద్యమించేలా కృషి చేశారు. దుగ్గిరాల వాక్ పటిమను, పోరాటాన్ని గుర్తించిన నాయకులు జాతీయ కాంగ్రెస్ కార్యదర్శిగా దుగ్గిరాలను ఎన్నుకున్నారు. ప్లేగు వ్యాధి కారణంగా 1928 జూన్ 10వ తేదిన దుగ్గిరాల మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని చీరాలలో ఊరేగించి రామ్‌నగర్‌లో దహన సంస్కారం చేశారు. అనంతరం దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కాంస్య విగ్రహాన్ని పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేశారు.

స్ట్రయిట్ కట్ కాలువ మలుపునకు అనుమతి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఈపురుపాలెం స్ట్రైట్ కట్ కాలువ మలుపునకు అనుమతిస్తూ, రెండు వర్గాల ఆమోదంతో పనులు చేపట్టాల్సిందిగా జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈమేరకు మత్స్య శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో ఈపురుపాలెం స్ట్రైట్ కట్ కాలువ మలుపు పరిష్కారం దిశగా లైన్ డిపార్టుమెంటు రైతు, మత్స్యశాఖ సంఘ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం మాలకొండయ్య, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈపురుపాలెం స్ట్రైట్ కట్ కాలువ పై అడవి పాలెంలోని 7 గ్రామాలు, వాడరేవులోని 6 గ్రామాలు, 593 బోట్లతో 1126 మంది సొసైటీ సభ్యులు, 13 గ్రామాలు, 1303 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని ఆయన తెలిపారు. రైతులు, మత్స్యకాలను దృష్టిలో పెట్టుకొని జెట్టి నిర్మాణానికి అనుమతి ఇస్తానని కలెక్టర్ తెలిపారు. రాటిఫికేషన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామన్నారు. మత్స్యకారులను దష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కారం కోసం రైతులకు, మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా కొంతమేరకు ఈపుపాలెం స్ట్రైట్ కట్ కాలువను మలుపు తిప్పాలని ఆయన అన్నారు. భూములు కోల్పోయే వారికి నష్టపరిహారం ఇస్తామన్నారు. కాలువ శాశ్వత పరిష్కారం కోసం నిజాంపట్నంలో మాదిరిగా పెద్ద పెద్ద సిమెంటు దిమ్మెలను వేస్తూ, రెండు వైపులా రిటైనింగ్ చేయడం జరుగుతుందన్నారు. సర్వే శాఖ ఏడీ కనకరాజు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, బాపట్ల, చీరాల ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

బాపట్ల: కృష్ణా నది వరద విపత్తును సమర్థంగా ఎదుర్కొనడానికి సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. పర్యావరణ విపత్తుల నిర్వహణపై హోం శాఖ మంత్రి అనిత, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి బుధవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో తీసుకున్న రక్షణచర్యలపై జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి వివరించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,400** గరిష్ఠం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,800**

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,179
అమ్మకాలు	46,990
నిల్వ	7,010

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,300
341	10,000-14,200
సూపర్ -10	10,000-13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,400
341	11,000-14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,100
బాడిగ 5531	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000-14,200
బాడిగ - 5531	10,000-12,500
ఆర్మూరు	10,200 - 13000
తాలు	5,300 - 7,200

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **271**

కొమ్ములు : **245** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,900	10,450	10,400

కాయలు : **26** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,500	10,000	10,000

మొత్తం అమ్మకాలు : **203.250** క్వింటాళ్లు

2070 నాటికి సూపర్‌పవర్‌గా భారతదేశం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- బాపట్లలో తిరంగా ర్యాలీ



ద్విచక్ర వాహనంపై ప్రదర్శనగా వెళుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎమ్మెల్యే, అధికారులు

బాపట్ల: భారతదేశం 2070 నాటికి సూపర్ పవర్‌గా తయారవుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం బాపట్ల కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జిల్లా కలెక్టర్ వెంకటమురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమెరికా, చైనా అగ్రదేశాల తర్వాత ఆర్థిక ప్రగతిలో భారతదేశం మూడోస్థానంలో నిలుస్తుందన్నారు. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి సాధించే దిశగా కృషి జరుగుతుందన్నారు. జిల్లాలో 15 లక్షల మంది జనాభా ఉన్నారని జాతి సమైక్యతకు చిహ్నంగా ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన చెప్పారు. ఈనెల 15వ తేదీన జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ఈనెల 15వ తేదీన పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే 79వ స్వాతంత్య్ర దినోత్సవానికి ప్రజలందరూ హాజరు కావాలని ఆయన కోరారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య ప్రాధాన్యత, విలువలను ప్రతి ఒక్కరికీ తెలియ జేయాలని ఆయన కోరారు. భారతదేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ విజయమ్మ, ఎక్సైజ్ శాఖ ఈఎస్ వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల అదృశ్యం

కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు



ఇద్దరు విద్యార్థినులతో సీఐ శేషగిరిరావు, ఎస్ఐ జనార్దన్

వేటపాలెం: ఇద్దరు బాలికలు అదృశ్యమైన కేసును 24 గంటల్లో ఛేదించి బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. బుధవారం సీఐ స్థానిక స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశాయిపేట, వేటపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు స్థానికంగా ఉండే కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. వీరిద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు.

వీరిద్దరికి చదువుపై ఆసక్తి లేదు. దీంతో మంగళవారం ఇద్దరు కళాశాలకు అని వెళ్లారు. సాయంత్రమైనా పిల్లలు ఇంటికి రాలేదని తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి వాకబు చేశారు. ఆచూకీ తెలియకపోవడంతో అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జనార్దన్ కేసు నమోదు చేసి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మైనర్ బాలికలు అదృశ్యంపై ఎస్పీ సీరియస్‌గా తీసుకొని వారి ఆచూకీ కోసం ఐదు ప్రత్యేక టీంలు ఏర్పాటు శారు. జిల్లా ఐటీ కోర్ టీం సాంకేతిక సహకారంతో ఇద్దరు మైనర్ బాలికల కోసం గాలింపు చేపట్టారు. బాలికలు ఇద్దరు గుంటూరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని తీసుకొచ్చి బుధవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదువుకోవాలని మందలించగా అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. బాలికలను 24 గంటలలోపు కనిపెట్టి కేసును ఛేదించిన చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్, రూర్ సీఐ శేషగిరిరావు, ఎస్సై పి. జనార్దన్‌ను ఇంకొల్లు ఎస్సై జీ. సురేష్‌ను ఎస్పీ అభినందించారు.

డీజిల్ దొంగల అరెస్టు

ఇన్నోవా కారు, 150 లీటర్ల డీజిల్ స్వాధీనం



ఆయిల్ దొంగలను అరెస్ట్ చేసిన సీఐ, ఎస్ఐలు

అద్దంకి రూరల్: రాత్రి సమయంలో పార్కింగ్ చేసిన లారీలు, బస్సుల్లో డీజిల్ దొంగతనం చేస్తున్న దొంగలను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం అద్దంకి సీఐ సుబ్బరాజు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన బాణావత్ బాలబాదు నాయక్, బాణావత్ తులసీబాబు నాయక్, మోరబోతు శ్రీను నాయక్, రామవత్ దుర్గానాయక్‌లు ఒకే ఊరికి చెందినవారు. వాళ్లంతా ఆయిల్ వాహనాలల్లో దొంగతనాలు చేస్తుంటారు. వీరు ఈనెల 10 వ తేదీన అద్దంకిలోని రామ్‌నగర్ పెట్రోలు బంకు వద్ద పార్కింగ్ చేసిన బస్సు నుంచి ఆయిల్ చోరీ చేశారు. దీనిపై బస్ యజమాని మేరువ శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్సై నరసింహులు, ట్రైనీ ఎస్సై వెంకటేశ్వరరెడ్డి, కానిస్టేబుల్స్ టీమ్‌గా ఏర్పడ్డారు. నలుగురు దొంగలను అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద కారులో కూర్చున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 లీటర్ల డిజిల్, ఇన్నోవా కారును సీఐ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు. రెండు నెలల క్రితం సంతమాగులూరు పరిధిలోని మక్కెనవారిపాలెం పెద్ద కాలువ వద్ద డీజిల్‌ను దొంగతనం చేశారు. వీరిపై గతంలో సంతమాగులూరు, కారంపూడి, బండ్లమోడు, బట్టిప్రోలు పలు కేసులు నమోదయ్యాయి

భావపురిలో బాపు అడుగుజాడలు

- బాపట్లలో ఖద్దరు ఉద్యమవ్యాప్తికి పిలుపునిచ్చిన గాంధీజీ
- కదిలివచ్చిన బాపట్ల ప్రజలు
- బాపు నడయాడిన రహదారికి మహాత్మాగాంధీ రోడ్డుగా నామకరణం
- స్వాతంత్య్ర సంబరాల్లో స్మరించుకుంటున్న జిల్లా వాసులు



బాపట్లలోని మహాత్మాగాంధీ రోడ్డు



బాపట్ల అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవ సంబరాన మువ్వన్నెల జెండా దేశభక్తిని నింపుకొని రెపరెపలాడుతోంది. బ్రిటిష్ దొరల నిరంకుశత్వాన్ని ఎందరో మహనీయులు ధిక్కరించారు. బతుకుదెరువుకు వచ్చి తమపైనే మీ పెత్తనమేంటంటూ నిలదీశారు. తుపాకీ గుళ్లకు గుండెలను అడ్డుపెట్టి తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించారు. అహింసే ఆయుధంగా చేసుకుని భరతమాతను స్వేచ్ఛా విహంగంగా మార్చారు. ఇంతటి స్వాతంత్య్ర పోరాటంలో బాపట్ల జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది.

బాపట్లకు విచ్చేసిన మహనీయులు

1929 ఏప్రిల్ 17న మహాత్మా గాంధీజీ ఖద్దరు ఉద్యమ వ్యాప్తికోసం మంతెనవారిపాలెం వచ్చారు. అక్కడ కనుమూరి వెంకట రాజు ఇంట్లో బస చేశారు. స్వాతంత్య్రం కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంకండి అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అక్కడ నుంచి ఏప్రిల్ 18న బాపట్లకు విచ్చేశారు. 1933 డిసెంబర్‌లో పెను తుపాను సందర్భంగా బాధితుల సహాయార్థం విరాళాల సేకరణకు రెండోసారి గాంధీజీ బాపట్ల వచ్చారు. 1934లో బాపట్లలో నిర్వహించిన బహిరంగ సభలో నెహ్రూ, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రసంగించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. మహాత్మా గాంధీజీ బాపట్ల ప్రాంత పర్యటనకు రాగా తిలక్ స్వరాజ్య నిధికి నగదుతో పాటు బంగారు ఆభరణాలను దేశ భక్తులు సమర్పించారు.

మహాత్మా గాంధీ రోడ్డుగా నామకరణం

1931 సంవత్సరంలో గాంధీ బాపట్లలో నడయాడిన రహదారికి మహాత్మాగాంధీ రోడ్డుగా నామకరణం చేశారు. బాపట్ల తాలూకా ఆఫీస్ నుంచి భావన్నారాయణ స్వామి గుడికి వెళ్లే రోడ్డును మహాత్మా గాంధీ రోడ్డు అని పిలుస్తున్నారు.

సహాయ నిరాకరణోద్యమంలో..

1920లో సహాయ నిరాకరణోద్యమం జరగ్గా బాపట్ల తాలూకాలోని 64 గ్రామాల్లో సంఘాలను ఏర్పరచి ఉద్యమాలను నడిపారు. కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గుమస్తాలు తమ ఉద్యోగాలకు స్వస్తి చెప్పి న్యాయవాదులతోపాటు ఉద్యమంలో చేరారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందున బాపట్ల ప్రాంతానికి చెందిన ఆంధ్రరత్న దుగ్గిరాలతోపాటు మంతెన క్రిష్ణంరాజు, బూదరాజు లక్ష్మీనారాయణ, బూదరాజు లక్ష్మీనరసింహారావు, పిల్లుట్ల హనుమంత రావు, అడుసుమల్లి శ్రీనివాసరావు పంతులు వంటి వారు జైలు పాలయ్యారు. ఉద్యమంలో భాగంగా 1921 డిసెంబర్ 31న 48 మంది గ్రామోద్యోగులు రాజీనామాలు సమర్పించారు.

విదేశీ వస్తు బహిష్కరణ

పన్నుల నిరాకరణోద్యమంలో భాగంగా నాటి బాపట్ల తాలూకాలోని పెదనందిపాడులో ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి గుంటూరు జిల్లా కలెక్టర్ రూథర్ ఫర్డ్ మిలిటరీ క్యాంపును ఏర్పాటు చేశారు. సంకా సీతారామయ్య, దాసరి శ్రీరాములును పెదనందిపాడు నుంచి చిలకలూరిపేట వరకు 8 మైళ్ల గుర్రం వెంట శిక్షగా పరుగెత్తించారు. 1930లో సాగిన ఉద్యమంలో పాల్గొన్నందుకు బాపట్ల తాలూకాలోని 124 మందిని నాటి ప్రభుత్వం జైలుకు పంపింది. విదేశీ వస్తు బహిష్కరణలలో పాలుగొన్నందుకు 44 మందికి 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు శిక్ష విధించారు.

చేపల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

మార్టూరు: రైతులు వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగుతో పాటు తమ భూముల్లో చేపల పెంపకాన్ని అదనపు ఆదాయంగా మార్చుకోవచ్చని బాపట్ల జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన ఔత్సాహిక చేపల రైతులతో స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొరమీను చేపల పెంపకం రైతులకు లాభసాటిగా ఉంటుందని చేపల పెంపకం కోసం ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు రైతులకు అందిస్తుందని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 35 శాతం, ఓసీ, బీసీ రైతులకు 25 శాతం చొప్పున రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. రైతులకు కనీసం 10 సెంట్ల భూమితో పాటు బోరు ఉండాలని చేపలు పెంచే రైతులు అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, ఎఫ్‌పీవో, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం సురేంద్రబాబు, మార్టూరు, జే. పంగులూరు, బల్లికురవ, సంతమాగులూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన రైతులు సీసీలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

రేపల్లె: భార్యను హత్య చేయడానికి ప్రయత్నించిన వ్యక్తికి నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష రూ.15 వేల జరిమానా విధిస్తూ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల బుధవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలను పట్టణ సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన అమర్తలూరి అనిల్ కుమార్ 2023 జూన్ 26వ తేదీ అర్ధరాత్రి సమయంలో భార్య శబరి నిద్రిస్తున్న సమయంలో రాడ్ తోదాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆ సమయంలో బాధితురాలు సోదరుడు చిలకలపూడి వెంకట లక్ష్మణరావు సంఘటనా స్థలానికి రావడంతో నిందితుడు అనిల్ పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న శబరిని సోదరుడు వైద్యశాల తరలించి చికిత్సలు అందించారు. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. సాక్షాలను ప్రవేశపెట్టగా సీనియర్ సివిల్ జడ్జి పై విధంగా తీర్పునిచ్చారన్నారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి వాదించినట్లు తెలిపారు.

అంతర్జాతీయ వేదికపై మెరిసిన జెస్సీ

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందనలు



జెస్సీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): జూలై 24 నుంచి 29 వరకు దక్షిణ కొరియాలో జరిగిన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం గెలుచుకున్న మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్, జెస్సీరాజ్ తన పతకాల జాబితాలో మరో మైలు రాయిని చేర్చుకోవడం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని జెస్సీ రాజ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ముందుగా జెస్సీని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ క్రీడా ప్రయాణానికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమె కోచ్ సింహాద్రిని ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే, జెస్సీ విజయయాత్రలో నిరంతర ప్రోత్సాహం, నిబద్ధత కనబరుస్తున్న ఆమె తల్లిదండ్రులను కూడా జిల్లా కలెక్టర్ అభినందించారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థులను విద్యతో పాటు, అన్ని రంగాల్లోను రాణించేలా తీర్చిదిద్దేందుకు సంక్షేమ అధికారులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ ఎస్. సత్యనారాయణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, ఎంజేపీఏపీబీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ప్రిన్సిపల్స్, వసతిగృహాల సంక్షేమ అధికారులు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులకు నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల సంక్షేమ అధికారులు విద్యను అందించటంతో పాటు, విద్యార్థులు క్రమశిక్షణతో జీవించేలా వ్యక్తిత్వ వికాసం పెంపొందించాలన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా క్రీడలు, ఆర్ట్స్ తదితర సృజనాత్మక రంగాల్లో ప్రోత్సహించాలన్నారు.

రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర రాజు మాట్లాడుతూ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల నిర్వహణను మరింతగా మెరుగుపర్చి, విద్యార్థులకు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో విద్యను అందించాలన్న ఉద్దేశంతో బీసీ సంక్షేమ అధికారులకు, వసతి గృహాల సంక్షేమ అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్పీ హేశ్వరరెడ్డి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా నిరంతరం వసతి గృహ సంక్షేమ అధికారులు పర్యవేక్షించాలన్నారు.